
సాక్షి ఒడిశా

గురువారం । 22 । ఆగస్టు । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 3,09,299

బంగారం : 200 మిల్లీ గ్రాములు

వెండి :48 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రాష్ట్ర ప్రగతికి చేయూత

ఒడిశాకు 6 కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుల మంజూరయ్యాయి. ఈ వివరాలను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాష్ట్రపతికి వివరించారు.

- 8లో



లైఫ్‌జాకెట్ తప్పనిసరి

చిలికా సరసులో తరచూ పడవ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయాణికులకు లైఫ్‌జాకెట్ తప్పనిసరి చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

మావోయిస్టు లొంగుబాటు



ముఖేష్ కోర్సాతో ఎస్పీ, డీఐజీ

మల్కన్‌గిరి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం హిడ్మా బెటాలియన్ 3వ కంపెనీలో దళ సభ్యుడు, మావోయిస్టు ముఖేష్ కోర్సా అలియాస్ సూర్యం బుధవారం మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ ఎదుట లొంగిపోయాడు. 2023లో మావోయిస్టుల్లో చేరిన సూర్యం ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దుల్లో జరిగిన పలు దాడుల్లో పాల్గొన్నాడు. మందుపాతర్లు పేల్చి పోలీసుల మృతికి కారకుడయ్యాడు. ఇతనిపై ఒడిశా ప్రభుత్వం రూ.2లక్షల రివార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖేష్ మాట్లాడుతూ మావోయిస్టు అగ్రనేతల ప్రాణ రక్షణకు చిన్నస్థాయిలో ఉండే తమలాంటి వారిని బలిచేస్తున్నారని, అందుకే దళాన్ని వీడానని చెప్పారు. గిరిజనుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రివార్డును త్వరలోనే ముఖేష్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దక్షిణ, పశ్చిమ రేంజ్ డీఐజీ చరణ్ సింగ్ మీనా పాల్గొన్నారు.

చిరుద్యోగి నిజాయితీ



విక్రమ్ జైన్‌కు ఆభరణం అప్పగిస్తున్న గుడ్డు, సంతున్

కొరాపుట్: వినియోగదారుడు పోగొట్టుకున్న బంగారు నెక్లెస్‌ను తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ చిరుద్యోగి. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త విక్రమ్‌జైన్ మంగళవారం రాత్రి చమిరియాగుడలోని బినోద్ ప్యాలెస్ హోటల్‌కు కుటుంబ సమేతంగా వచ్చారు. భోజనాలు చేసి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి చూసేసరికి భార్య నెక్లెస్ కనిపించలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం హోటల్లో పని చేస్తున్న వెంకటేశ్వర పూజారి (గుడ్డు) హోటల్‌ను శుభ్రం చేస్తుండగా నెక్లెస్ గుర్తించి యజమాని సంతున్‌కుమార్ రథ్‌కు తెలియజేశారు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి విక్రమ్ జైన్‌కు సమాచారం అందించి నెక్లెస్ అప్పగించారు. ఈ సందర్భంగా గుడ్డును స్థానికులు అభినందించారు.

గజరాజుల హల్‌చల్



తెరువలి అడవుల్లో ఏనుగులు

రాయగడ: జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలోని తెరువలి గ్రామంలో ఇంఫా కర్మాగారం వెనుక అటవీ ప్రాంతంలో బుధవారం ఏనుగులు హల్‌చల్ సృష్టించాయి. పిల్ల ఏనుగుతో పాటు మూడు పెద్ద ఏనుగులు ఆహారం కోసం రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు వాటిని తరిమికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాయగడ డివిజన్ అటవీ శాఖ రేంజర్ ఆచారి పర్యవేక్షిస్తున్నారు.

చొరబాటుదారులను అడ్డుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సమాజ్ ప్రతినిధులు

జయపురం: బంగ్లాదేశ్ నుంచి ముస్లిమ్‌లు, రోహింగ్‌లు ఒడిశాలోకి చొరబడకుండా చర్యలు చేపట్టాలని జయపురం హిందూ సమాజ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జయపురం సబ్ కలెక్టర్, పోలీసులకు వినతిపత్రాలు అందజేశారు. ఇప్పటికే వచ్చిన అక్రమ చొరబాటుదారులను గుర్తించి వెనక్కి పంపించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ సమాజ్ జయపురం కార్యదర్శి నిరంజన్ పాణిగ్రాహి, కోశాధికారి సుధాకర పాత్రో, బాబు షాడంగి తదితరులు పాల్గొన్నారు.

- అసెంబ్లీని కుదిపేసిన చికిటి సారా మృతి ఘటన
- ఆర్‌డీసీ విచారణకు ప్రతిపక్షాల డిమాండ్
- పోడియం చుట్టుముట్టి నిరసన
- వాయిదా వేసిన స్పీకర్



స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టిన విపక్ష సభ్యులు

కల్తీ సారా ఎఫెక్ట్

దద్దరిల్లిన సభ

భువనేశ్వర్: కల్తీ సారా ఘటన శాసన సభను కుదిపేసింది. గంజాం జిల్లాలో జరిగిన కల్తీ సారా ఘటనలో తాజాగా ఒకరు మృతి చెందడంతో రెండో రోజు సభ దద్దరిల్లింది. విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడటంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. స్పీకర్ పోడియం చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేయడంతో సభ వాయిదా పడక తప్పలేదు.

ప్రశ్నోత్తరాలకు గండి..

రెండో రోజు సమావేశాల్లో వ్యవసాయం, రైతు సాధికారత, ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి, విద్యుత్‌శక్తి, సహకార సంఘాలు, మత్స్య, పశుసంపద, వస్త్ర పరిశ్రమ, హస్తకళలు, ఎంఎస్ఎంఈ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించడానికి షెడ్యూల్ ఖరారు చేశారు. ఇంతలో చికిటి కల్తీ సారా మృత్యు ఘటనతో దుమారం చెలరేగడంతో కార్యక్రమం నీరుగారిపోయింది. ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు పోడియం చుట్టుముట్టి నినాదాలతో సభను హోరెత్తించారు. సభా కార్యకలాపాలు ముందుకు సాగేందుకవీలు కాకపోవడంతో తొలుత ఉదయం 11.30 గంటల వరకు తదుపరి సాయంత్రం 4 గంటల వరకు వరుసగా వాయిదా పడింది.

ఆర్‌డీసీ విచారణ చేయించాలి..

కల్తీ సారా మరణాలపై ఆర్డీసీ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని బిజూ జనతా దళ్ డిమాండ్ చేసింది. మద్యం రహిత ఒడిశాకు బదులుగా, దొంగ సారా అమ్మకాలు పెరుగుతున్నాయని మండిపడింది. ఈ వ్యాఖ్యలను అధికార బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యానసామంత్రాయ్ తిప్పికొట్టారు. కల్తీ సారా వ్యవహారంలో విపక్ష బిజూ జనతా దళ్ హస్తం ఉందని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా ఆందోళనలు చేయిస్తోందని, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు బీజేడీ కుట్రపన్నుతోందని మండిపడ్డారు. ఎప్పటినుంచో చికిటి ప్రాంతంలో మద్యం వ్యాపారం జరుగుతోందని గుర్తు చేశారు. ప్రస్తుతం చోటు చేసుకున్న విచారకర ఘటన పట్ల దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పూర్తి విచారణ తర్వాత వాస్తవ సూత్రధారుల ముసుగు తొలుగుతుందని చెప్పారు.



ఆందోళన చేస్తున్న జెనాపూర్ గ్రామస్తులు

భువనేశ్వర్: గంజాం జిల్లా చికిటిలో కల్తీ సారా తాగిన ఘటనలో జురో బెహరా అనే వ్యక్తి బరంపురం ఎమ్‌కేసీజీ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనతో జెనాపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మృతుడి కుటుంబానికి రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో చికిటి, దిగొపాహండి ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా, కల్తీ సారా తాగి మరో 23 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, అబ్కారీ శాఖ ఇప్పటి వరకు నలుగురిని అరెస్టు చేశారు.

బీజేపీలో అసమ్మతి రాగం!

- రాజ్యసభ ఉప ఎన్నికలో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్
- పార్టీ తరఫున మమత.. స్వతంత్ర అభ్యర్థిగా జగన్నాథ్
- అంతా పథకం ప్రకారమే అంటున్న పరిశీలకులు



ముఖ్యమంత్రి సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి మమత మహంతా



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ నేత జగన్నాథ ప్రధాన్

భువనేశ్వర్: ఒడిశాలో రాజ్యసభ ఉపఎన్నికల వాతావరణం వేడెక్కింది. బీజేపీ అభ్యర్థిగా మమత మహంతా నామినేషన్ దాఖలు చేసిన మరుక్షణంలో అదే పార్టీకి చెందిన నాయకుడు జగన్నాథ్ ప్రధాన్ స్వతంత్ర అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేయడం అధికార పార్టీలో అసమ్మతి రాజుకుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జగన్నాథ్ ప్రధాన్ 10 మంది ప్రతిపాదకులతో రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. చెండీపొదా నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అగస్తీ బెహరా మరో 9 మంది అధికార పక్షం శాసన సభ్యులు ప్రతిపాదకులుగా ఉన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో ఈ ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. జగన్నాథ్ ప్రధాన్ ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో భువనేశ్వర్ సెంట్రల్ స్థానం నుంచి పోటీ చేశారు. స్వల్ప ఓట్ల తేడాతో బిజూ జనతా దళ్ అభ్యర్థి అనంత నారాయణ్ జెనా చేతిలో ఓడిపోయారు. భారతీయ జనతా పార్టీ అధికారికంగా మమతా మహంతను రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసి ముఖ్యమంత్రి ఇతర ప్రముఖుల సమక్షంలో బుధవారం ఉదయం నామినేషను దాఖలు చేయించింది. ఈ పరిస్థితుల్లో అదే పార్టీకి చెందిన మరో వ్యక్తి నామినేషను చేయడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది.

బీజేపీ వ్యూహమే..!

ఈ చర్యను సాధారణ వర్గాలు బీజేపీలో చీలికగా వ్యాఖ్యానిస్తున్నప్పటికీ ఎటువంటి పరిణామాలు తలెత్తకుండా జగన్నాథ్ ప్రధాన్‌ని డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయించి ఉంటుందని పరిశీలకుల వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మమత విజయం తథ్యం..

147 మంది సభ్యుల రాష్ట్ర శాసనసభలో బీజేపీకి 78 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. వీరితో పాటు మరో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకుంది. ఈ లెక్కన పార్టీ అభ్యర్థిగా రాజ్య సభ బరిలో ఉన్న మమత మహంతా గెలుపు తథ్యం. బీజేడీకి 51 మంది, కాంగ్రెస్‌కు 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సభలో ఒక సీపీఎం సభ్యుడు ఉన్నారు. వీరందరి సమైక్యంతోనైనా ప్రతిపక్షానికి గెలిచేందుకు తగిన సంఖ్యా బలం లేదు. అయితే జగన్నాథ ప్రధాన్ రంగ ప్రవేశం ఎలా ప్రభావితం చేస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ఒకే ఒక్కడు..

రాష్ట్రం నుంచి ఎగువ సభలో భారతీయ జనతా పార్టీ బలం తక్కువే. ఎగువ సభలో ఒకే ఒక సభ్యుడు అశ్విని వైష్ణవ్ బీజేపీ అభ్యర్థిగా చలామణి అవుతున్నారు. ఆయన వరుసగా 2 సార్లు బీజేడీ అండతోనే రాజ్యసభకు ఎన్నిక కావడం గమనార్హం.

మరోసారి రాజ్యసభ రేసులో మమత

మమత మహంత బీజేడీతరఫున 4 సంవత్సరాల 4 నెలలు రాజ్యసభలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది జూలై 31న బీజేడీ నుంచి వైదొలగి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం బీజేపీలో చేరారు. ప్రస్తుత ఉప ఎన్నికలో గెలుపొందితే 20 నెలల పాటు బీజేపీ నుంచి రాజ్యసభలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారు. కాగా, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్ పాల్ సింగ్ తోమర్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు నామినేషన్ దాఖలు సమయంలో మమతా వెంట ఉన్నారు.

గండాహాతికి జలకళ

పర్లాకిమిడి: ఇటీవల కురిసిన వర్షాలకు గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లో గండహాతి జలపాతం జలకళను సంతరించుకుంది. దీంతో స్థానికులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా నుంచి అధికసంఖ్యలో పర్యాటకులు విచ్చేసి ఇక్కడి అందాలను ఆస్వాదిస్తున్నారు. ప్రస్తుతం ఓడాసింగి నుంచి గండాహాతి, గంగాబడ పంచాయతీ వరకూ తారు రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు అనువుగా ఉంది. మందస, సాబకోట మీదుగా కూడా మట్టి రోడ్డు సౌకర్యం ఉండటంతో పర్యాటకుల పోటెత్తుతున్నారు..



గండాహాతి జలపాతం



పార్టీలో చేరిన వారితో ఎంపీ బలభద్ర మఝి, ఎమ్మెల్యే నర్సింగ్ బోత్రా

బీజేడీనీ వీడి బీజేపీలోకి..

కొరాపుట్: బిజూ జనతా దళ్ పార్టీ నుంచి భారతీయ జనతా పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా బుధవారం బీజేపి రాష్ట్ర కార్యాలయంలో నబరంగ్‌పూర్ జిల్లా ఝొరిగాం విధాన సభ స్థానం పరిధిలోని చందాహండి సమితి బొడటిమరా సర్పంచ్ జయంతి ముదలి, నాయక్ సర్పంచ్ బిమల్ జానీ, పలువురు వార్డులు సభ్యులు బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మఝి, ఝొరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్రా పాల్గొన్నారు.

కోటి దాటాలి



వర్క్‌షాపు వేదికపై ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాజీ, ఇతర ప్రముఖులు

- కోటి మందికి బీజేపీ సభ్యత్వం లక్ష్యం: రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్
- విజయవంతం చేయాలి: సీఎం మోహన్‌చరణ్ మాఝీ



కార్యక్రమానికి హాజరైన సభ్యులు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ ప్రచారం – 2024 రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ వెలుగొందుతుందన్నారు. సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానుందని ప్రకటించారు. రాష్ట్రంలో కోటి మందికి సభ్యత్వం కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లా, పార్టీ, మండల, బ్లాక్ స్థాయిలలో వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నామని చెప్పారు.

సెప్టెంబరు 1న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభ్యుడిగా నమోదు చేసుకున్న తర్వాత రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఆగస్టు 22, 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఆగస్టు 25, 26, 27 తేదీల్లో మండల స్థాయిలో, ఆగస్టు 31లోగా బ్లాక్ స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని వివరించారు.

సరికొత్త పంథాలో..

కొత్త సభ్యుల నమోదు ప్రక్రియని సరికొత్త పంథాలో నిర్వహిస్తుందని సామల్ ప్రకటించారు. మిస్డ్ కాల్స్, క్యూఆర్ కోడ్, నమో యాప్ పార్టీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వం కల్పిస్తామన్నారు. మారుమూల ప్రాంతాలలో రిజిస్ట్రేషన్ ఫారమ్‌తోనే సభ్యత్వాన్ని ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్ పాల్ తోమర్, కో–ఇన్‌చార్జ్ లతా ఉసేంది, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యాలయ అధికారులు, జిల్లా అధ్యక్షులు హాజరయ్యారు.

భారత్‌బంద్ ప్రశాంతం

ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ అఖిల భారత ఆదివాసీ, దళిత, హరిజన సమన్వయన కమిటీ పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన భారత్ బంద్ ఒడిశాలో ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రయివేటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పెట్రోలు బంకులు, లాడ్జీలు, దుకాణాలు, విద్యాలయాలు మూతపడ్డాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. వివిధ సంఘాల నాయకులు సుప్రీం కోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

– భువనేశ్వర్/జయపురం/పర్లాకిమిడి/రాయగడ/మల్కన్‌గిరి/కొరాపుట్



భువనేశ్వర్: సంబలపూర్‌లో రైల్ రోకో



జయపురం: ఆందోళన చేస్తున్న మహాదళిత పరిసంఘ్ ఒడిశా మహిళా అధ్యక్షురాలు మనోలిసా టక్రి



జయపురం: మెయిన్ రోడ్డులో మూతపడిన వాహనాలు



పర్లాకిమిడి: బెత్తగుడ లైన్‌లో ఆందోళన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేషన్ కౌన్సిల్ సభ్యులు



పర్లాకిమిడి: కొత్త బస్టాండ్‌లో నిలిచిన ప్రైవేటు బస్సులు



కొరాపుట్: జొరిగాం బంద్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మఝి



కొరాపుట్:నందపూర్‌లో రోడ్డుకి అడ్డంగా టైర్లు పెట్టిన దృశ్యం



కొరాపుట్: కుర్సింగ్‌లో బడి మూయడంతో పరుగులు తీస్తున్న బాలలు



మల్కన్‌గిరి: మెయిన్ రోడ్డులో రాకపోకలు బంద్



రాయగడ: మూతపడిన దుకాణాలు

క్లుప్తంగా

గంజాయి రవాణా కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు ఆకాశ్

జయపురం: రెండేళ్ల కిందటి గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి బుధవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రావణభట్ట గ్రామానికి ఆకాశ్ ఉపాధ్యాయ 2022 జూలై 11న బముణిగాం–బిశాయిపుట్ గ్రామాల మధ్య కారులో 52 కేజీల గంజాయి తరలిస్తుండగా పోలీసులు వెంబడించారు. కొద్దిదూరంలో కారును విడిచి పెట్టి పరారయ్యాడు. ఎట్టకేలకు నిందితుడిని గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

నదిలో జారిపడి మహిళ మృతి


మంగి మృతదేహం

మల్కన్‌గిరి: మత్తిలి సమితి నాయక్‌గూడ పంచాయతీ కోయిలిగూడ గ్రామానికి చెందిన మాంగి మక్క (65) పంగం నదిలో జారిపడి మృతిచెందింది.లోచన్ బక్క భార్య మంగి బక్క సోమవారం సాయంత్రం డెంగగూడలోని తన పుట్టినింటికి కాలినడకన బయలు దేరింది. పంగం నది దాటుతుండగా ఒక్కసారిగా జారిపడి మునిగిపోయింది. మంగళవారం సాయంత్రం మత్స్యకారులు చేపల వేటకు వేసిన వలలో మంగి మృతదేహం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం కోసం తరలించారు.

ఫ్యాషన్ పోటీల్లో నబరంగ్‌పూర్ బాలుడి ప్రతిభ


సముద్ర దేవుడి వేషధారణలో తాహిద్ హసన్ ఖాన్

కొరాపుట్: అంతర్జాతీయ ఫ్యాషన్ పోటీల్లో నబరంగ్‌పూర్ జిల్లా బాలుడికి ప్రథమ స్థానం లభించింది. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఫ్యాషన్ రన్ వే ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన దివంగత మాజీ మంత్రి హబిబుల్లా ఖాన్ మనుమడు తాహిబ్ హసన్‌ఖాన్ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచాడు. లక్కతో తయారైన జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాలతో అద్భుత ప్రదర్శన ఇచ్చారు. తమ కుమారుడి విజయం పట్ల తల్లిదండ్రులు తారిఖ్ హసన్ ఖాన్, హస్మ బానో హర్షం వ్యక్తం చేశారు.

పండిత సత్కారం

రాయగడ: స్థానిక బాలాజీనగర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో విశాఖపట్నానికి చెందిన ప్రముఖ కవి, రచయిత పి.సత్యవతి రచించిన సత్యరామాయణాన్ని 'రామాయణ పారాయణ జ్ఞాన యజ్ఞం' పేరిట ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమం మంగళవారం రాత్రితో ముగిసింది. ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవాసమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు ఆధ్వర్యంలో సత్యవతిని ఘనంగా సత్కరించారు.

రైలు కూత.. రాష్ట్ర ప్రగతికి చేయూత

- ఒడిశాకు 6 కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుల మంజూరు
- రాష్ట్రపతికి వివరాలు వెల్లడించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్


భారత రాష్ట్రపతికి కొత్త రైలు ప్రాజెక్టులను వివరిస్తున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: రాష్ట్రానికి ఇటీవల ఆరు కొత్త రైలు మార్గాల ప్రాజెక్టులను భారత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రానికి చేకూరే ప్రయోజనాల్ని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రభావిత జిల్లాల్లో అవసరమైన సేవలను అందించడం, ఆర్థిక వృద్ధిని సాధించడంలో ఈ ప్రాజెక్టులు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ నెల 10న మొత్తం 8 ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందని, వాటిలో ఆరు ఒడిశాలో ఉన్నాయని వివరించారు. సీసీఈఏ ఆమోదం తర్వాత ఈ నెల 19న రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టులను మంజూరు చేసింది.

అనుసంధానం-ఆర్థిక పురోగతి

ఈ కొత్త రైలు మార్గ ప్రాజెక్టులు గతంలో అనుసంధానించబడని ప్రాంతాలను కలుపుతూ సులభతరమైన రవాణా నెట్‌వర్క్‌లను విస్తరిస్తాయమని మంత్రి పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తాయని చెప్పారు. ఈ పనుల వల్ల సుమారు 3 కోట్ల పనిదినాలతో వేలాది మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే మంజూరైన రూ. 70,000 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లతో, ఒడిశా రైల్వే మౌలిక సదుపాయాలలో రూ. లక్ష కోట్ల అదనపు పెట్టుబడితో ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రణాళికలో భాగంగా ఉందని వివరించారు.

రాష్ట్రానికి మంజూరైన రైలు మార్గాలు:			
జిల్లాలు	ప్రాజెక్టు	పొడవు (కిలోమీటర్లు)	వ్యయ అంచనా (రూ.కోట్లలో)
రాయగడ	గుణుపురం–తేరువాలి	73.62	1,165.89
కలహండి, నవరంగ్‌పూర్	జునాగఢ్ రోడ్ –నవరంగ్‌పూర్	116.21	2,864.51
మల్కన్‌గిరి, తూర్పు గోదావరి	మల్కన్‌గిరి – పాండురంగపురం	173.61	3,591.76
కెంజొహార్, మయూర్‌భంజ్	బాదంపహాడ్ – కెందుఝొురాగొడా	82.06	1,875.72
మయూర్‌భంజ్	బంగ్రిపోషి – గోరుమహిసాని	85.60	2,269.49
మయూర్‌భంజ్, తూర్పు సింగ్‌భమ్, ఝర్‌గ్రామ్	బురరామ– చకులియా	59.96	1,459.13

సుస్థిర అభివృద్ధి..

వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇనుప ఖనిజం, ఉక్కు, సిమెంట్, బాక్సైట్ వంటి నిత్యావసర వస్తువుల రవాణాకు ఈ రైలు మార్గాలు చాలా కీలక పాత్ర పోషించనున్నాయి. సమీకృత, బహుళ మోడల్ కనెక్టివిటీకి ప్రాధాన్యమిస్తూ పీఎం గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌లో అంతర్భాగంగా ఉన్నాయి. 64 కొత్త స్టేషన్ల నిర్మాణం, 6 ఆకాంక్షాత్మక జిల్లాలకు (తూర్పు సింగ్‌భమ్, భద్రాద్రి కొత్తగూడెం, మల్కన్‌గిరి, కలహండి, నవరంగ్‌పూర్, రాయగడ) కనెక్టివిటీని పెంచడం, సుమారు 510 గ్రామాలను కవర్ చేయడం, సుమారు 40 లక్షల జనాభాకు ప్రయోజనం చేకూర్చడం వంటివి కొత్త రైల్వే లైన్లతో సాకారం కానున్నాయి.

అభివృద్ధి పరుగులు పెట్టాలి


సమావేశం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రణాళికా వ్యయాన్ని పెంచాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికారులను ఆదేశించారు. బుధవారం లోక్‌సేవా భవన్‌లో కార్యదర్శి స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో మరిన్ని పెట్టుబడులతో వృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. వివిధ శాఖలు, ప్రత్యేకించి మౌలిక వసతుల కల్పనకు మరింత మంది సాంకేతిక సిబ్బందిని నియమించి కార్యక్రమాలు విస్తృత పరచాలన్నారు. అనంతరం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి శాశ్వత్ మిశ్రా తులనాత్మక ఆదాయ, వ్యయ నివేదికను సమర్పించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలా తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే సంస్థకు, ఈ ప్రాంతానికి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. బుధవారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ కళాశాల 35వ వార్షికోత్సవ సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. కళాశాల ఆవరణలో ఉన్న మూడు అసంపూర్ణ భవనాల నిర్మాణం ఏడాదిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బరంపురం అబ్కారీ సూపరింటెండెంట్ సస్పెన్షన్

భువనేశ్వర్: గంజాం జిల్లా చికిటి కల్తీ సారా దుర్ఘటనలో ప్రమేయమున్న అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు బరంపురం అబ్కారీ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని బుధవారం ఆదేశించారు. అంతకుముందు అబ్కారి ప్రిన్సిపల్ సెక్రటరీ సుశీల్ కుమార్ లొహాని, కమిషనర్ నర్సింగ్ భోల్‌తో సమావేశమై అక్రమ మద్యం డిస్టిలరీలు, విక్రయ కేంద్రాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇప్పటికే చికిటి ఘటనకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా జరిపిన దాడుల్లో 7,274 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

జయపురం ఎమ్మెల్యేకు యూజేఏ కృతజ్ఞతలు


ఎమ్మెల్యే బాహినీపతితో సంఘ నాయకులు

జయపురం: జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర విధాన సభలో ప్రస్తావించిన జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతిని రాష్ట్ర ఉత్కళ జర్నలిస్టు అసోసియేషన్ (యూజేఏ) కార్యవర్గ ప్రతినిధులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 20న జర్నలిస్టుల డిమాండ్లను ప్రస్తావించి వెంటనే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వభూషణకర్ ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

మైత్రీ కంపెనీ ఆక్రమణలు అడ్డుకోండి


కొరాపుట్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: మైత్రీ కంపెనీ ఆగడాలు అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీ చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత కోరారు. ఈ మేరకు మంగళవారం రాత్రి సింగారం గ్రామస్తులతో కలిసి కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తి వాసన్‌కు ఫిర్యాదు చేశారు. ఎటువంటి గ్రామసభ, అనుమతులు లేకుండా మైత్రి సంస్థ బాక్సైట్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసిందన్నారు. 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాధిత గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

'డుడుమా'లో వసతుల కల్పనపై దృష్టి


డుడుమా జలపాతాన్ని తిలకిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

కొరాపుట్: ప్రఖ్యాత డుడుమా జలపాతాన్ని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తివాసన్ సందర్శించారు. దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నందున ఇక్కడ మరింతగా వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లమ్తాపుట్ సమితిలో కాఫీ పంటల అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. కాఫీ మొక్కల సాగు పెంచాలని గిరిజనులకు సూచించారు. అనంతరం వినతులు స్వీకరించారు.

విద్యార్థి మృతదేహంతో ఆందోళన


పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

మల్కన్‌గిరి: పోడియా సమితి నీలిగూడ పంచాయతీ ధరంపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి సుకాంత్ మాడీ (12) మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం ఆందోళనకు దిగారు. పాఠశాల యజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు జ్వరం బారిన పడి మృతి చెందాడని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్, బీడీఓలు గ్రామస్తులకు నచ్చచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి


నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది

పర్లాకిమిడి: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి మెటర్నరీ వార్డు డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి 50 పడకల మాతా శిశు ఆసుపత్రి నుంచి ర్యాలీగా వెళ్లి నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

గోపినాథనంద శర్మ సేవలు చిరస్మరణీయం


సభలో మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణీ మిశ్రా

పర్లాకిమిడి: ఒడిశా భాషాభివృద్ధికి పండిత గోపినాథనంద శర్మ అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. శర్మ 155వ జయంతి వేడుకను బుధవారం ఒడియా మంగళి వీధిలోని ఉత్కల సమాజ్ భవనంలో నిర్వహించారు. ఒడిషా సాహిత్య అకాడమీ మాజీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, డాక్టర్ కల్యాణీ మిశ్రా, ఉత్కళ సమ్మేళనం అధ్యక్షుడు పూర్ణచంద్ర మహాపాత్రో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, సమాజసేవి భరత్ భూషణ్ మహాంతి తదితరులు హాజరై శర్మ గొప్పతనాన్ని వివరించారు. ఒడియా భాషపై శర్మకున్న మక్కువను గుర్తించి పర్లాకిమిడి మహారాజా కృష్ణచంద్రగజపతి తన కళాశాలలో పండితులుగా పదవి ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ పురస్కార గ్రహీత బినోద్ కుమార్ జెన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కు భూవిజ్ఞాన పురస్కారం


రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రశాంత్‌కుమార్ పాత్రో

రాయగడ: హైదరాబాద్‌లోని హబ్సిగూడ వద్ద భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ) చీఫ్ సైంటిస్ట్‌గా పాతికేళ్లుగా సేవలు అందిస్తున్న డాక్టర్ బొటు ప్రశాంత్‌కుమార్ పాత్రోకు జాతీయ భూవిజ్ఞాన పురస్కారం–23 లభించింది. మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. భూభౌతిక శాస్త్రం, అప్లయిడ్ జియో ఫిజిక్స్‌లో చేసిన సేవలను గుర్తింపుగా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఈ అవార్డును ప్రకటించింది. అవార్డు దక్కడం సంతోషంగా ఉందని పాత్రో ఫోన్ ద్వారా 'సాక్షి'కి తెలిపారు. ఈయన రాయగడలోని కరణం వీధిలో జన్మించి వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు.

అమరవీరులకు నివాళులు


ర్యాలీగా వెళ్తున్న చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, మాజీ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క

మల్కన్‌గిరి : జిల్లాలోని మత్తిలి సమితిలో 1942 ఆగస్టు 21న సాయిద్ లక్ష్మణ్ నాయిక్ నిర్వహించిన సమావేశంలో 40 మంది గిరిజనులు అమరులయ్యారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఈ ప్రాంతంలో గూలికండా దినోత్సవం నిర్వహించి అమరులకు నివాళులర్పిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, మాజీ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్కలు మత్తిలి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గూలి స్తూపం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మత్తిలి సమితి అధ్యక్షుడు మహేష్ బక్క, పెద్ద ఎత్తున గిరిజన కార్యకర్తలు పాల్గొన్నారు.

వేధించే ట్రాన్స్‌జెండర్లపై చర్యలకు వినతి


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: ఇతర జిల్లాల నుంచి ఎటువంటి కార్డులు లేకుండా వచ్చి అసాంఘిక చర్యలకు పాల్పడే ట్రాన్స్‌జెండర్ల(కిన్నెరలు)పై చర్యలు చర్యలు తీసుకోవాలని నబరంగ్‌పూర్ జిల్లా కిన్నెరల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సంఘ సభ్యులు నబరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మను కలిసి వినతిపత్రం అందించారు. సమీప కలహండి జిల్లా నుంచి కొందరు కిన్నెరలు ఈ ప్రాంతానికి వచ్చి డబ్బులు అడుగుతున్నారని, ఇవ్వని వారిపై దాడులు చేస్తున్నారని చెప్పారు. నబరంగ్‌పూర్ జిల్లాలో కిన్నెర సంఘం ఉందని, గుర్తింపు కార్డులు కూడా ఉన్నాయని, ఏదో ఒక పని చేసుకొని గౌరవంగా బతుకుతున్నామని చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చందాలు వసూలు చేయడం తగదన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు మనోజ్ పట్నాయక్, న్యాయ సలహాదారుడు రాంప్రసాద్ పాత్రో, సభ్యులు చుంకి, కాజల్, సనా, వర్షా, కుని, ఇప్సిత తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ విజేత హాకీ జట్టుకు సత్కారం


ఒడిశా హాకీ స్టార్ అమిత్ రోహిదాస్‌కు రూ.4 కోట్ల చెక్ అందజేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి


సత్కార సభలో పాల్గొన్న భారత్ హాకీ జట్టు సభ్యులు

భువనేశ్వర్: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టును ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, రాష్ట్ర క్రీడలు యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, భారత హాకీ అధ్యక్షుడు దిలీప్ తిర్కి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులకు రూ.15 లక్షలు చొప్పున, సహాయక సభ్యులకు రూ.10 లక్షలు చొప్పున, జట్టు సీనియర్ ప్లేయర్, గోల్ కీపర్ శ్రీజేస్‌కు రూ. 50 లక్షలు నగదు పురస్కారం అందజేశారు. ఒడిశా హాకీ స్టార్ అమిత్ రోహిదాస్‌కు రూ. 4 కోట్ల చెక్ ప్రదానం చేశారు.

పిడుగుపాటుకు ఆరుగురు మృత్యువాత

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వేర్వేరు చోట్ల పిడుగులు పడ్డాయి. బాలాసోర్, భద్రక్ జిల్లాల్లో నలుగురు, ఢెంకనాల్, కేంద్రాపడా జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. మృతులకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాపం తెలియజేశారు. మృతుల బంధువులకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు.

లైఫ్‌జాకెట్ లేకుంటే పడవ ప్రయాణం నిషేధం


చిలికా సరసులో ప్రయాణికులతో నిండిన పడవ

భువనేశ్వర్: చిలికా సరసు నడి బొడ్డున తరచూ ప్రయాణికులతో నిండిన పడవలు చిక్కుకుతున్నాయి. గంటల తరబడి ప్రయాణికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గమ్యం చేరుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రాణాపాయం నివారణకు స్థానిక అధికార యంత్రాంగం నడుం బిగించింది. ఇకపై పడవల్లో ప్రయాణికులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలని ఆదేశించారు. ఈ జాకెట్లని పడవ యజమాని నిత్యం అందుబాటులో ఉంచాల్సిందేనని స్పష్టం చేశారు. లైసెన్స్, చార్జీల బోర్డు, తాగు నీరు ఉంచకుంటే నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి పడవలను నిలిపివేస్తామని తహసీల్దార్ అభిషేక్ సాహు, మండల అభివృద్ధి అధికారి (బీడీఓ) కృష్ణప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

జాబ్ మేళాలో 56 మంది ఎంపిక



ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: స్థానిక వీటీ అగ్రహారంలో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 56 మంది తదుపరి దశకు ఎంపికయ్యారు. కేవల్ గ్రూప్ ఎస్కే సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన జాబ్ మేళాకు మొత్తం 112 మంది హాజరయ్యారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, కంపెనీల హెచ్ఆర్‌లు వి.బాబ్జీ, జి.నాగేశ్వరరావు, యంగ్ ప్రొఫెషనల్ ఎం.యశ్వంత్ బాబు, జిల్లా ఉపాధి కార్యాలయం, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

25న జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 25న అండర్ 9 విభాగంలో బాల, బాలికలకు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి బుధవారం తెలిపారు. విజయనగరంలోని ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు 2015 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు అర్హులుగా పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం వారి సొంత ఖర్చులతో పంపించనున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చని, పేర్ల నమోదుకు ఫోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

25న జూనియర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగబోయే జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి లీలాకృష్ణ బుధవారం తెలిపారు. వచ్చేనెల 14, 15, 16 తేదీల్లో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరం శివారులో గల విజ్జి స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-14,16,18,20 విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే ఎంపిక పోటీల్లో నిర్ణీత వయస్సు గల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అండర్-16, 18,20 విభాగాల్లో పాల్గొనే వారు టెన్త్ క్లాస్ మార్క్స్ లిస్ట్ ఒరిజినల్ వెంట తీసుకు రావాలని స్పష్టం చేశారు. అలాగే అండర్-14 విభాగంలో పాల్గొనే మండల తహసీల్దార్ ధ్రువీకరించిన సర్టిఫికెట్‌ను వెంట తీసుకు రావాలని సూచించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులు కావాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపకులు కావాలని ఆసక్తిగల వారు ఈనెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు కావాలన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో 55శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. నెట్, స్లెట్లతో పాటు పీహెచ్‌డీ లాంటి అదనపు విద్యార్హతతో పాటు బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలియజేశారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్‌గా వరప్రసాద్



సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కనకల వరప్రసాద్‌ను ఈ నెల 22 నుంచి చైనాలో జరగనున్న అండర్ 15,17 బాలబాలికల విభాగానికి భారత ప్రభుత్వం కోచ్‌గా నియమించింది. ఈ విషయం తెలిసిన గ్రామ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వరప్రసాద్ 2006వ సంవత్సరంలో మామిడిపల్లి హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీరాములు వద్ద ఓనమాలు నేర్చుకున్నారు. ఈ విషయం తెలిసిన ఆయన తన శిష్యుడు అంతర్జాతీయ స్థాయిలో కోచ్‌గా ఎంపికవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరప్రసాద్ అస్సాం బ్యాడ్మింటన్ స్టేడియంలో కోచ్‌గా సేవలందిస్తున్నారు.

25లోగా దరఖాస్తులు చేసుకోవాలి

పార్వతీపురం: ఖరీఫ్ సీజన్‌లో 2024-25 సీఎంఆర్‌లో కొత్తగా పాల్గొనదలచిన మిల్లు యజమానులు అనుమతుల కోసం ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో కొత్తగా ధాన్యం మిల్లును ఏర్పాటుచేసిన యజమానులంతా గడువులోగా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జేసీ ఎస్ఎస్.శోభిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముగ్గురు ఇంజినీర్ల సస్పెన్షన్

- అలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం

పార్వతీపురంటౌన్/గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏలో ముగ్గురు గిరిజన ఇంజినీరింగ్ శాఖాధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. దీనికి సంబంధించి అదేశాలు జారీ అయ్యాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శాంతీశ్వరరావు, భద్రగిరి సెక్షన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం, అదే సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉన్న శ్యాం ప్రసాద్‌లపై సస్పెన్షన్ విధించారు. ఐటీడీఏ గిరిజన ఇంజినీరింగ్‌శాఖలో ఒకేసారి ముగ్గురు అధికారులు సస్పెన్షన్‌కు గురికావడం కలకలం రేపింది. ఈ సస్పెన్షన్‌కు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.



ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం

ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్

గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సబ్ డివిజన్‌లో రెసిడెన్షియల్ ఐటీఐ, కురుపాం మండలంలోని నీలకంఠాపురం ఆశ్రమ పాఠశాల నిర్మాణాలను దత్తసాయి కన్‌స్ట్రక్షన్ ప్రారంభించింది. 2021లో ఈ పనులకు సంబంధించి ఆ సంస్థ మేనేజింగ్ పార్టనర్ బీబీ అప్పారావు అప్పటి సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రసాద్ సంతకాన్ని ఫోర్జరీ చేసి సప్లిమెంటరీ అగ్రిమెంట్ డాక్యుమెంట్లను విశాఖపట్నం నుంచి మెయిల్ ద్వారా ఇంజినీరింగ్‌శాఖ పార్వతీపురం కార్యాలయానికి పంపించారు. అదే సమయంలో పని అంచనాలు, తదితర డాక్యుమెంట్స్ పూర్తిగా మార్చివేశారు. అయితే వాటిని పరిశీలించని అధికారులు పనులు పూర్తయిన తరువాత బిల్లులు 2023లో బిల్లులు చెల్లించారు. అయితే సుమారు రూ. 43 లక్షల మేర కాంట్రాక్టర్ అదనంగా గిరిజన ఇంజినీరింగ్‌శాఖ నుంచి స్వాహా చేసినట్లు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు దర్యాప్తు నిర్వహించారు. డాక్యుమెంట్స్‌లో అప్పటి సూపరింటెండెంట్ ఇంజినీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కాంట్రాక్టర్ అదనపు సొమ్మును పొందినట్లు తెలిసింది. దీంతో ముగ్గురు ఇంజినీరింగ్ అధికారులను బాధ్యులను చేస్తూ సస్పెన్షన్ వేటు వేశారు.

గతంలోనూ ఇదే పరిస్థితి

గిరిజన ఇంజినీరింగ్‌శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏదో ఒక కారణంతో వరుసగా సస్పెన్షన్లకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈఈ శాంతీశ్వరరావు సస్పెన్షన్ కాగా ఆయనకు ముందు మోహన్‌రావు ఏసీబీ దాడులకు గురై సస్పెండ్ అయ్యారు. అంతకు ముందు పని చేసిన కుమార్ పాడేరులో సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా మణిరాజ్



ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన మణిరాజ్

పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సాలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మణిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు రావడంతో మణిరాజ్ బాధ్యతలు స్వీకరించారు.

పట్టపగలే ఇల్లు గుల్ల

- 13.5 తులాల బంగారం,
- 17 తులాల వెండి,
- రూ.20వేలు నగదు చోరీ చేసిన దొంగలు

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఒక ఇంటి వెనుక వైపు గల కిటికీని ఇనుపు రాడ్డుతో విరగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు 13.5 తులాల బంగారం, 17 తులాల వెండి ఆభరణాలు, రూ. 20 వేలు నగదును దోచుకుపోయారు. పట్టపగలు జనం అటూఇటూ తిరుగుతునే ఉన్నప్పటికీ దుండగులు వారి పని కానిచ్చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూమిరెడ్డి ఎర్నాయుడు స్థానికంగా ఉన్న స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్‌లో కార్మికుడిగా పనిచేస్తూ ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన ఇద్దరు పిల్లలు వేర్వేరు ప్రాంతాల్లో హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. కాగా బుధవారం ఉదయం ఎర్నాయుడు భార్య రమాదేవి వ్యవసాయ పనులకు వెళ్లగా ఎర్నాయుడు గేదెలను తోలుకుంటూ పొలంలోకి వెళ్లాడు.తిరిగి 12 గంటల ప్రాంతంలో ఇంటికి భార్యాభర్తలు చేరుకుని లోపలికి వెళ్లేసరికి బీరువాలో గల బట్టలు, నగలు భద్రపరుచుకునే పెట్టెలు, తదితర వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించారు. ఇంటి వెనుకవైపు వెళ్లి చూడగా కిటికీ గ్రిల్స్‌ను రాడ్డుతో విరగొట్టి తొలగించి లోనికి దొంగలు ప్రవేశించినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు ఎర్నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై ఆర్.గోపాలరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలను సేకరించింది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు.



బీరువాలో బట్టలు, ఇతర సామగ్రి చిందరవందరగా పడి ఉన్న దృశ్యం

గ్రామ సభల నిర్వహణకు కమిటీల ఏర్పాటు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 23న గ్రామ సభలు నిర్వహించాలని, ఈ మేరకు ప్రతి గ్రామంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖామంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 23న గ్రామసభలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టుల గుర్తింపునకు పంచాయతీ బాధ్యత వహించాలని, వార్డు సభ్యులు పనులను అమలు చేయడం, పర్యవేక్షించడం చేయాలని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులు, ప్రాజెక్టుల ఆమోదం కోసం అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధిహామీ పథకంలో కొత్తగా ఫీడర్ కాలువ నిర్మించేందుకు, కొత్త పంట కాలువ నిర్మాణం, పొలం గట్లపై మొక్కల పెంపకంపై అవగాహన, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు, వ్యక్తిగత భూముల్లో భూమి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమాలకు సంబంధించి మండల స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు.


కందిపప్పు ఇవ్వరా?

- గర్భిణులు, బాలింతలకు ఎగవేత
- జిల్లాలో లబ్ధిదారులు 16,866 మంది

విజయనగరం ఫోర్ట్: జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు పేర్లు మార్చడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ పథకాలను అమలు చేయడంలో చూపించడం లేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి పథకాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కంటే గొప్పగా అమలు చేస్తామని గ్రామగ్రామాన ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కిన తర్వాత విస్మరిస్తున్నారు. ఫలితంగా లబ్ధిదారులకు పథకాలేవీ సక్రమంగా అందడం లేదు. తాజాగా గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన కందిపప్పు ఇంతవరకు వారికి అందలేదు. కందిపప్పు లేకుండా మిగతా సరుకులు అంగన్‌వాడీలు లబ్ధిదారులకు అందించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి పేరు మార్పు

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీకి వైఎస్సార్ సంపూర్ణ పోషణ అని పేరుపెట్టింది. ఈ పథకం కింద గర్భిణులు, బాలింతలకు కిట్లు అందించేది. ఈ పథకం కింద నెలకు సరిపడా బియ్యం 3 కేజీలు, కందిపప్పు కేజీ, ఆయిల్ అరకేజీ, రాగిపిండి 2 కేజీలు, అటుకులు కేజీ, ఖర్జూరం పావు కేజీ, చెక్కీలు పావుకేజీ, బెల్లం పావుకేజీ, పాలు 5 లీటర్లు, 25 గుడ్లు చొప్పున అందించేది. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకానికి బాల సంజీవని అని పేరు పెట్టింది.



కందిపప్పు

కందిపప్పు లేకుండానే..

గర్భిణులు, బాలింతలకు ప్రస్తుతం కందిపప్పు లేకుండానే అంగన్‌వాడీలు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. జిల్లాలో గర్భిణులు, బాలింతలు 16,866 మంది ఉన్నారు. వారిలో గర్భిణులు 8,740 మంది, బాలింతలు 8,126 మంది. వారికి నెలకు 16, 866 కేజీల కంది పప్పు అవసరం. అయితే ఈనెల ఇంతవరకు కందిపప్పు ఇవ్వలేదు.



కంది పప్పు లేకుండా బాలింతలకు అందిస్తున్న కిట్లు

కందిపప్పు సరఫరా కాలేదు

గర్భిణులు, బాలింతలకు సంబంధించి కందిపప్పు ఇంతవరకు రాలేదు. అందుకే అందించలేక పోయాం. వచ్చిన తర్వాత అందిస్తాం.
బి.శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

ఎరువుల డీలర్‌కు నోటీసు

- వీఏఏ సమక్షంలో డీఏపీ విక్రయం

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం ఫోర్ట్: డీఏపీకి గుళికలతో లింక్ పెడుతున్నారనే అంశంపై సాక్షిలో 'అది కొంటేనే ఇది'..! శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. డీఏపీకి గుళికలకు లింక్ పెట్టి రైతులకు విక్రయించిన గంట్యాడ మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర జనరల్ స్టోర్ ఎరువుల దుకాణానికి మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌కుమార్ నోటీసు ఇచ్చారు. అంతేకాకుండా దుకాణంలో ఉన్న డీఏపీ ఎరువును కొఠారుబిల్లి గ్రామ వ్యవసాయ సహాయకుడు ఉదయ్ రైతులకు విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి తెలిపారు.



డీఏపీ ఎరువును వెంకటేశ్వర జనరల్ స్టోర్‌లో విక్రయిస్తున్న వీఏఏ ఉదయ్

ఇండియన్ పోలీస్ మెడల్ గ్రహీతకు ఎస్పీ అభినందనలు

విజయనగరం క్రైమ్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ పోలీసు మెడల్‌ను విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో ఆగస్టు 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్న భోగాపురం ఏఎస్సై తిరుమలరాజు సూర్యనారాయణరాజును ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. పోలీస్ మెడల్ అందుకున్న తిరుమలరాజు సూర్యనారాయణ రాజు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆయనను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పని చేసి, ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అభిలషించారు. తిరుమలరాజు సూర్యనారాయణ రాజు పోలీసుశాఖకు అందించిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి 2023 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇండియన్ పోలీసు మెడల్ ప్రకటించగా, 2024 విజయవాడలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రదానం చేశారు. 1989లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరిన తిరుమలరాజు సూర్యనారాయణరాజు, 2010లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సీతానగరం, పాచిపెంట, కొత్తవలస, విజయనగరం టూ టౌన్, వన్ టౌన్, సీసీఎస్, జీఆర్‌పీ, చీపురుపల్లి, భోగాపురం పోలీస్‌స్టేషన్లలో సమర్థవంతంగా పని చేసి, అధికారుల మన్ననలు పొందారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎస్సై తిరుమలరాజు సూర్యనారాయణరాజు

గంజాయితో ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణా, అమ్మకంపై వచ్చిన సమాచారంతో విజయనగరంలోని నాయుడు ఫంక్షన్ హాల్ వెనుక సీఎంఆర్ జంక్షన్ వద్ద ఇద్దరు నిందితులను బుధవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ ఎస్సై నరేష్ తెలిపారు. ఈ దాడుల్లో ధమమునూరి జ్యోతిరామ్ (ఎ1), సునముడి అనురాధ (ఎ2)లు పట్టుబడ్డారన్నారు. జ్యోతిరామ్ బుధవారం ఉదయం సీఎంఆర్ జంక్షన్ వద్ద నాయుడు ఫంక్షన్ హాల్ వెనుకకు వెళ్లి గంజాయిని, గంజాయి పొగాకు మిశ్రమా(పొడర్)న్ని తీస్తుండగా వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, రెవెన్యూ సమక్షంలో పట్టుకున్నట్లు తెలిపారు. వారి దగ్గర రెండున్నర కేజీల గంజాయి, 4 కేజీల గంజాయి, పొగాకు కలిసిన మెటీరియల్‌ను సీఎస్‌డీటీతో సీజ్ చేయించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై నరేష్ వివరించారు.

డీఎస్సీ శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ కోచింగ్ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ కోచింగ్ ఇచ్చేందుకు అనుభవం , ఎక్కువ ఉత్తీర్ణత శాతం కలిగిన సంస్థలు, వ్యక్తుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు స్టడీ మెటీరియల్‌తో సహా పూర్తి వివరాలతో దరఖాస్తులను పార్వతీపురం ఐటీడీఏ పీఎంఆర్‌సీకి ఆగస్టు 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా సమర్పించాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9441606731, 7013196555 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ రెండు వందల మంది గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఎంపికకు శిక్షణ ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉద్యోగ అవకాశాలు

శ్రీకాకుళం రూరల్: ఏదైనా డిగ్రీ అర్హత గల వారికి పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగంలో చేరేందుకు మూడు నెలలు పాటు ఉచిత శిక్షణను ఎచ్చెర్లలోని టీటీడీసీలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 7680945337, 7995013422 అనే నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉద్రిక్తంగా మారిన దర్యాప్తు

బలిజిపేట: మండలంలోని నారన్నాయుడువలసలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై దర్యాప్తు నిర్వహించే సమయంలో చెలరేగిన ఉద్రిక్తతలో 10 మంది గాయాలపాలయ్యారు. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఉపాధిహామీ పథకం పనుల విషయంలో ఒక వర్గానికి చెందినవారు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులు దర్యాప్తు చేసేందుకు బుధవారం గ్రామానికి వచ్చారు. అదే సమయంలో కొంతమంది వచ్చి అధికారులకు వివరణ ఇస్తుండగా ఫిర్యాదుచేసిన వర్గం వారు అక్కడికి వచ్చి అక్కసుతో వివరణ ఇస్తున్న వారిని కర్రలు, రాళ్లతో కొట్టారు. ఈ దాడిలో సుమారు 10మంది గాయాల పాలు కాగా వారిలో తాడు, నరిసింగ రావు, రాము, పాపమ్మ, సన్యాసి తదితరులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు చెప్పారు. దర్యాప్తులో ఏపీడీ బి.శ్రీహరిరావు, ఈసీ శ్రీనివాస రావు, ట్రైనీ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.



దాడిలో గాయాల పాలైన గ్రామస్తుడు

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



రామునాయుడు (ఫైల్)

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామానికి చెందిన ఇజ్జురోతు.రామునాయుడు(40) పొలంలో మోటార్ వేసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉడిచిన వరిచేను నీరు లేక ఎండిపోవడంతో పంటకు నీళ్లు పెట్టేందుకు మోటార్ ఆన్‌చేసేందుకు వెళ్లిన రామునాయుడికి షాక్ కొట్టిందని తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య గౌరి, కుమార్తె సీతాలక్ష్మి, కుమారుడు బాషా ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

భోగాపురం: మండలంలోని గాలిపేట గ్రామానికి చెందిన బోర బంగారి(54) విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. ఈ ఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గాలిపేట గ్రామానికి చెందిన బోర బంగారి కుమారుడు అప్పలనరసయ్య జేసీబీ నడుపుతూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అదే గ్రామంలో ఒకరి ఇంటిని కూల్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని తండ్రి బంగారితో కలిసి పనులు ప్రారంభించాడు. ఇల్లు కూల్చివేస్తున్న సమయంలో జేసీబీ తన తండ్రికి తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కుమారుడు అప్పలనరసయ్య, కుటుంబసభ్యులు బంగారిని హుటాహుటిన విజయనగరం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుని చిన్న కుమారుడు సురేష్ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డిప్యూటీ వార్డెన్‌కు షోకాజు

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ప్రవీణ్‌కుమార్‌కు ఐటీడీఏ పీఓ వీవీ.రమణ బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటీవల తహసీల్దార్ బాలమురళీ కృష్ణ ఈ పాఠశాలను సందర్శించిన సమయంలో అక్కడ పలు లోపాలను గుర్తించారు. ముఖ్యంగా మెనూ సక్రమంగా లేకపోవడం, వంట సరుకుల్లో నాణ్యతా లోపాలు, పరిసరాల పరిశుభ్రతలో లోపాలపై ఐటీడీఏ పీఓకు తహసీల్దార్ అందించిన నివేదిక మేరకు షోకాజ్ జారీ చేసినట్లు పీఓ తెలిపారు.

23న గ్రామసభల్లో ప్రజలు పాల్గొనాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23న జరగనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ పిలుపునిచ్చారు. ఈ సభల్లో ప్రజలంతా పాల్గొనేలా చూడాలని ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించిన పనులపై విస్తృతంగా గ్రామసభల్లో చర్చించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా జరగాల్సిన గ్రామ సందర్శన కార్యక్రమాన్ని ఈ విడత వాయిదా వేసుకుని శుక్రవారం జరిగే గ్రామసభల్లో ప్రతి నోడల్ అధికారి విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ గ్రామసభల నిర్వహణపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విజయనగరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాల్గొన్నారు. అనంతరం మండల నోడల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 775 గ్రామ పంచాయితీల్లో ఒకేరోజున గ్రామ సభలను పూర్తి చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

• గోతుల రోడ్డుపై నరక ప్రయాణం



భామిని ఏబీ రోడ్డులో సాధారణ వాహనాల రాకపోకలకే ఆపసోపాలు పడాల్సిన దుస్థితి. అలాంటి రోడ్డులో విశాఖ పోర్ట్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు 124 టైర్లతో కూడిన భారీ లారీపై బుధవారం సిలిండర్ తరలించారు. గోతుల రోడ్డుపై లారీను ఎక్కడికక్కడే నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. – భామిని